క్లుప్తంగా

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు (శనివారం) ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ములుగులోని బీడీ కార్మికుల కాలనీ, కృష్ణాకాలనీ, జీవింతారావుపల్లి, మాదవరావుపల్లి, గణేష్‌లాల్‌పల్లి, మదనపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

7న శాంతియుత నిరసన

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 07న నిర్వహించనున్న శాంతియువ నిరసనను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెనీ ప్రకటించి ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకలపై జరుగతున్న భౌతికదాడులకు శాంతియుత నిరసన తెలిపేందుకు పోలీస్ అధికారులు అనుమతి నిరాకరించడమే కాకుండా ఈ నెల 31 వరకు పోలీస్ యాక్ట్ అమలు చేస్తామని ప్రకటించారని అన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు బీఆర్‌ఎస్ ఎన్ని అడ్డంకులు సృష్టించిన లొంగేది లేదని అన్నారు.

'డీవైఎఫ్‌ఐ నాయకుల అరెస్ట్ సరికాదు'

వాజేడు: డీవైఎఫ్‌ఐ నాయకుల అక్రమ అరెస్టులు సరికాదని జిల్లా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బల్సుపాటి నరేష్ తెలిపారు. చలో సచివాలయం కార్యక్రమాన్ని భగ్నం చేయడంలో భాగంగా గురువారం అర్ధరాత్రి డీవైఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించి, ఆపై విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఆ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో సచివాలయ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నరేష్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ సునీల్‌కుమార్ అన్నారు. కెనరా బ్యాంకు 120 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ఆవరణలో మేనేజర్ సునీల్‌కుమార్, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


బ్యాగులు పంపిణీ చేస్తున్న నాగరాజు

వెంకటాపురం(ఎం): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పింగిలి నాగరాజు ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం మండలంలోని నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రియనేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం సర్వర్ అహ్మద్ ఉన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సోడి అశోక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలిపాక పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు దాటుతున్న నేటి వరకు పాఠశాలకు ఉపాధ్యాయులు లేక పాఠశాల తెరుచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు పాదయాత్రగా వెళ్లి ఐటీడీఏ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయుడిని నియమించాలని అన్నారు.

ముప్పనపల్లిలో ఇద్దరి మృతి

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లిలో ఇద్దరు మృతి చెందిన చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బిల్ల మల్లయ్య (50) రైతు నిత్యం గుడుంబా తాగి అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉండగా వారికి పెళ్లిలు అయ్యాయి. భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. అలాగే అదే గ్రామానికి చెందిన దాసరి సమ్మయ్య (60) అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. గ్రామంలో ఇద్దరు ఒకే రోజు మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పనులు పూర్తయ్యేదెప్పుడో?

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని రహదారి
- బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద నిలిచిన పనులు
- వానలు పడితే తప్పని తిప్పలు


వాజేడు వద్ద హైలెవెల్ బ్రిడ్జి వద్ద పూర్తి కాని రహదారి

వాజేడు: ప్రధాన మంత్రి గ్రామీన సడక్ యోజన కింద మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి నుంచి ఏడ్జెర్ల పల్లి గ్రామంవరకు రహదారి మంజూరైంది. ఈ రహదారి పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. రోడ్డు నిర్మాణం చేపట్టిన బ్రిడ్జిల, కల్వర్టుల వద్ద అలానే వదిలేశారు. ఎప్పుడు ఈ పనులను పూర్తి చేస్తారో తెలియని దుస్థితి.

నిలిచిన పనులు

గుమ్మడిదొడ్డి నుంచి ఏడ్జెర్లపల్లి గ్రామం వరకు రెండు చోట్ల కల్వర్టుల వద్ద, మూడు చోట్ల బ్రిడ్జిల వద్ద రహదారి పనులను పూర్తి చెయలేదు. ఏడ్జెర్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న తోగు వద్ద కల్వర్టుకు గుంత పడింది. ఇక్కడ కనీసం కల్వర్టు నిర్మాణం కూడా చేయలేదు. ఏడ్జెర్లపల్లి పూసూరు మధ్యన ఉన్న బొమ్మనపల్లి వాగును దాటిన తరువాత నిర్మించిన బ్రిడ్జి వద్ద పనులు అసంపూర్తిగా వదిలేశారు. పుసూరుకు సమీపంలో ఉన్న రెండు కల్వర్టుల వద్ద, మండల కేంద్రంలోని హైలెవెల్ వంతెన వద్ద, కొంగాల వా గుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద రహదారి పనులు చేపట్టలేదు.

వానలు పడితే ఇబ్బందులు

వర్షాలు పడితే ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తప్పవు. భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జిల వద్ద వాహనాలు దిగబడే అవకాశం కూడా ఉంది. కొంగాల వాగు బ్రిడ్జి వద్ద ఇక్కడ గత వర్షాకాలం ఆర్టీసీ బస్సు దిగబడగా పోలీసులు, ఇతర శాఖల అధికారులు క్షేమంగా బయటకు తీసి పంపించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేమంగా వారి ఇళ్లకు తరలించారు. ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


బొమ్మనపల్లి వాగు సమీపంలోని బ్రిడ్జి వద్ద..


కొంగాల వాగు బ్రిడ్జి వద్ద..


ఏడ్జెర్లపల్లిలో కల్వర్టు వద్ద పడిన గుంత


పూసూరు గ్రామ సమీపంలోని కల్వర్టు నిర్మించకుండా ఉన్న రహదారి

ఆదివాసీలపై కేసులు నమోదు చేయొద్దు

వెంకటాపురం(కె): షెడ్యూల్డ్ ఏరియాలో భూ వివాదాల్లో ఆదివాసీలపై కేసులు నమోదు చేయొద్దని ఆదివాసీ నవ నిర్మాణ సేవ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై కొప్పుల తిరుపతిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నరసింహమూర్తి మాట్లాడుతూ ఏజెన్సీలో కోనేరురంగరావు సిఫార్సులు అమలు చేయాలన్నారు. గిరిజనేతరులు గిరిజనుల భూములను ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. భూ వివాద ట్రెస్‌పాస్ కేసులను కూడా ఆదివాసీలపై నమోదు చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజా మహేష్, మిడెం లక్ష్మయ్య, సురేష్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ నాయకులు

రోశయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం


ములుగు రూరల్: రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ డాక్టర్ శబరీశ్


ఏటూరునాగారంలో..

- ఎస్పీ డాక్టర్ శబరీశ్

ములుగు రూరల్: రోశయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మాత్యులు కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం రోశయ్య చిత్రపటానికి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా ప్రజా సేవలో ఉంటూ ప్రజలకు సేవలందించిన మహోన్నత వ్యక్తి రోశయ్య అని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సదానందం, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శంకర్, డీపీఓ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్‌ఐ స్వామి, సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో మాజీ మంత్రి రోశయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి అధికారులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఐటీడీఏ మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

గములుగు రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చిందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జంపన్న తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్‌మేళా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.


జాబ్‌మేళాకు హాజరైన యువకులు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వాజేడు: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి


వెంకటాపురం(కె): విద్యార్థులతో వైద్య సిబ్బంది


హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

- వైద్యాధికారి తుమ్మ స్వప్నిత


మంగపేట: విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి స్వప్నిత

మంగపేట: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల వ్యాధుల బారిన పడకుండా విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య నియమాలను పాటించాలని మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి తుమ్మ స్వప్నిత సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(జూనియర్ కాలేజీ)లో వైద్యాధికారి స్వప్నిత ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిసరాలు, వంటశాలను పరిశీలించారు. అనంతరం 61 మంది విద్యార్థులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఇంద్రావతి, ఏఎన్ఎం శిరీష, ఆశ కార్యకర్తలు సమ్మక్క పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాదుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తప్పక పాటించాలని చుంచుపలి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 09 మంది జ్వరపీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాదులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సీతమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వాజేడు: మండల కేంద్రంలోని టీజీడబ్ల్యూయూఆర్‌జేసీ బాలికల హాస్టల్లో శుక్రవారం హాస్టల్లోని విద్యార్థినులకు వాజేడు వైద్యాధికారి మహేందర్ ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. హాస్టల్ పరిసరాలను చూసిన వైద్య సిబ్బంది, వంటలను, నిత్యావసర సరుకులు నిల్వ ఉంచే గది, డైనింగ్ ఏరియాను చూశారు. 59 మందికి వైద్య పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. హెచ్‌వీ వెంకటనర్సమ్మ, ప్రిన్స్‌పాల్ కిరణ్మయ్, చిన్న వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, లక్ష్మి, శాంత కుమారి, లఖాన్ ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి జ్యోతి హాజరై విద్యార్థుకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు గొంది హనుమంతు, కామేష్, భాస్కర్, ప్రశాంత్, నరేష్, ఉష, ఇందిర, పద్మ తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని బుర్గుపేట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి 40మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డాక్టర్ అనిత, ఎంఎల్‌హెచ్‌పీ నవీన్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో సహస్రఘటాభిషేకం


శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శివాలయంలో సహస్రఘటాభిషేకం పూజలను అర్చకుడు రాజ్‌కుమార్ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి 21వ వార్షికోత్సవం సందర్భంగా ధ్వజస్తంభం పూజ, నీటి బిందెలతో సహస్ర ఘటాభిషేకం, అభిషేకాలు భక్తులు ఘనంగా చేపట్టారు. శివలింగాన్ని అన్నపూర్ణేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్, సోమందపు నర్సింహులు, గార పోషాలు, కర్ల అరుణ, కట్కూరి రాధిక, వల్స తిరుపతి, ఇర్సవడ్ల కిరణ్, లాలమ్మ, వేణుగోపాల్ లాహోటి, రామాలయం చైర్మన్ అలువాల శ్రీనివాస్, సాయిబాబా గుడి చైర్మన్ పెండ్యాల ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పడు ప్రచారాలు


మాట్లాడుతున్న చాంద్‌పాషా


మాట్లాడుతున్న రవియాదవ్

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న పది సంవత్సరాలు పేదలను పట్టించుకోని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయిస్తే జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, నాయకులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు చేయడం మానుకోవాలి

బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు జిల్లాలో శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చల్వాయి గ్రామానికి చెందిన రమేశ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓంప్రకాష్, సయ్యద్ షకిల్, చక్రపు శ్రీనివాస్, నద్దునూరి రమేష్, ఒజ్జల కుమార్, నేపాల్‌రావు, పాషా, నిరంజన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న నాయకులు'

ఎస్ఎస్‌తాడ్వాయి: స్వార్థ రాజకీయాల కోసం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ అమాయ ప్రజలను రెచ్చగొట్టి రాజకీయాలు చేయడం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు సరైంది కాదన్నారు. జిల్లాలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌లపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్, మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, నాయకులు కోడి సతీష్, ముద్రకోల తిరుపతి, పాక రాజేందర్, పులి రవి, రాపోలు సంజీవరెడ్డి, మడకం శోభన్, కాల్వల సమ్మయ్య, ఎనగంటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

మురుగు నీరు వెళ్లేలా కాల్వలు తీయించాలి

వాజేడు: నివాసాల సమీపంలోని గుంతల్లో నిల్వ ఉన్న నీరు బయటకు వెళ్లడానికి కాల్వలు తీయించాలని కోరుతూ.. శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు మండల కేంద్రంలోని శివాలయం వీధిలోని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా అధికారులకు చెపుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. కొప్పనాతి కృష్ణ మూర్తి, నీరిక్షణ, శ్రీను, రాంబాబు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

'గిరిజనేతరులకు పట్టాలివ్వొద్దు'

మంగపేట: ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకువచ్చన భూభారతి ఆర్ఓఆర్ చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు పట్టాలు జారీ చేయొద్దని మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు అధ్వర్యంలో ఆ సంఘ నాయకులు తహసీల్దార్ రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగారాజు మాట్లాడుతూ.. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన అంటి నాగరాజు గిరిజనేతరులకు ఇచ్చిన అక్రమ పట్టాలను రద్దు చేసి ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన భూభారతి రెవెన్యూ చట్టం ద్వారా గిరిజనేతరులకు చెందిన భూములకు ఎలాంటి పట్టాలు ఇవ్వకుండా నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘ నాయకులు తోలెం నర్సింహారావు, అన్నెబోయిన సమ్మయ్య పాల్గొన్నారు.

మీసేవల ద్వారా పహాణీలు ఇవ్వాలి

- తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్‌కుమార్

మంగపేట: అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను ప్రభుత్వం జారీ చేసిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పహాణీలను మీసేవల ద్వారా జారీ చేయాలని కోరుతూ తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు తహసీల్దార్ రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాల కోసం పహాణీ తీసుకునే ప్రతీసారి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవల్సి వస్తుందని అధికారులు సకాలంలో పహాణీలు జారీ చేయడంలో ఆలస్యం చేస్తుండటం వలన ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి మీసేవా ద్వార పహాణీలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, ఉపాధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, రవివర్మ, భార్గవ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజీవ్ యువ వికాసం నిధులు జమ చేయాలి

ములుగు రూరల్: మల్లంపల్లి మండలంలోని రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీడీఓ రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యాయలంలో బ్యాంక్ అధికారులు, ఎంపీడీఓతో కలిసి లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి చాలాకాలం అవుతున్న లబ్ధిదారుల ఖాతాల్లో నేటి వరకు డబ్బులు పడలేదని అన్నారు. ఈ కార్యకరమంలో నాయకులు రాజు, సంపత్, గణపతి, తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు